09-02-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఈ పాత ప్రపంచములో ఇంకే ఆశను పెట్టుకోకుండా భవిష్య ఉన్నత పదవిని పొందేందుకు కేవలం నష్టోమోహులుగా అవ్వండి, తండ్రిని స్మృతి చేయండి మరియు పవిత్రంగా అవ్వండి"

ప్రశ్న:- తండ్రి ఎటువంటి సరళమైన, డైరెక్ట్ మార్గాన్ని తెలియజేస్తారు, ఏ విషయంతో తండ్రికి సంబంధం లేదు?

జవాబు:- తండ్రి పిల్లలకు శాంతిధామానికి, సుఖధామానికి వెళ్ళేందుకు డైరెక్ట్ మరియు సరళమైన ఏ మార్గాన్ని తెలియజేస్తారంటే - పిల్లలూ, కేవలం తండ్రిని స్మృతి చేయండి మరియు పవిత్రంగా ఉండండి. ఇకపోతే, మీ ఎదురుగా ఏదైనా ఆపద వస్తే, దుఃఖము లేక అనారోగ్యము వస్తే, దివాలా తీస్తే... అవన్నీ మీ-మీ కర్మ లెక్కలే, వీటితో తండ్రికి ఏ సంబంధము లేదు. తండ్రి యుక్తులు తెలియజేస్తారు, కర్మ బంధనము నుండి విముక్తులవ్వడము పిల్లలు ప్రతి ఒక్కరి పని.

ప్రశ్న:- కొంతమంది పిల్లలు ఏ ఒక్క కారణము వలన సేవకు యోగ్యులుగా అవ్వరు?

జవాబు:- ఫెమీలియారిటీ (అతి చనువు) యొక్క తేలికపాటి నషా, లోపల మాయ పురుగు పట్టి ఉంది - ఈ కారణముగా సేవకు యోగ్యులుగా అవ్వలేరు.

పాట:- దుఃఖపు కాలము పోయింది... (లౌట్ గయా గమ్ కా జమానా...)

ఓం శాంతి. సంతోషము మరియు దుఃఖము. ఇప్పుడు ఇది రావణ రాజ్యము. రావణ రాజ్యము అని దేనినంటారు అనేది మనుష్యులకైతే తెలియదు. దుఃఖము ఎప్పుడు ఉంటుంది మరియు సంతోషము ఎప్పుడు ఉంటుంది అనేది తండ్రి వచ్చి పిల్లలకు అర్థం చేయిస్తారు. ఈ రావణ రాజ్యములో దుఃఖము కూడా ఉంది, అలాగే సంతోషము కూడా ఉంది. ఇప్పుడిప్పుడే సంతోషము, ఇప్పుడిప్పుడే దుఃఖము. బిడ్డ జన్మిస్తే సంతోషము, మరణిస్తే దుఃఖము. సన్యాసులు కూడా - ఇక్కడి సుఖము కాకి రెట్ట సమానమైనది అని అంటారు. కావున తప్పకుండా దీనిని దుఃఖపు ప్రపంచము అని అంటారు. కానీ వారికి తెలియనే తెలియని విషయమేమిటంటే - సదా సుఖము, ఎక్కడైతే దుఃఖము యొక్క నామ-రూపాలు కూడా ఉండవో, అది సత్యయుగములోనే ఉంటుంది. తప్పకుండా ఇప్పుడు ఇది రాత్రి అని పిల్లలైన మీకిప్పుడు తెలుసు. రాత్రి దుఃఖముతో కూడినదిగా ఉంటుంది, దీనిని రావణుడి రాత్రి అని అంటారు. రావణుడు రావడంతో భక్తి ఆరంభమవుతుంది. వికారాలు ఆరంభమవుతాయి. మనం సదా సంతోషములో ఉండే పురుషార్థాన్ని ఇప్పుడు చేస్తున్నామని ఇప్పుడు పిల్లలైన మీరు అర్థం చేసుకుంటారు. తండ్రి అర్థం చేయిస్తున్నారు, పిల్లలూ, భవిష్య ఉన్నత పదవిని పొందే పురుషార్థము చేయండి, ఇంకే ఆశను పెట్టుకోకూడదు. అనంతమైన తండ్రి నుండి ఏం లభిస్తుంది అనేది పిల్లలకు తెలియనే తెలియదు. తండ్రే వచ్చి తెలియజేస్తారు. పరమాత్మ నుండి ఏం లభిస్తుంది అనేది ప్రపంచానికి తెలియదు. దుఃఖము-సుఖము వారే ఇస్తారని భావిస్తారు. తండ్రి అంటారు, నేనైతే సదా సుఖాన్ని ఇవ్వడానికి వస్తాను. మీరు కేవలం శ్రీమతముపై నడవండి. నేను మీకు శాంతిధామము మరియు సుఖధామము యొక్క మార్గాన్ని తెలియజేయడానికి వచ్చాను. ఆ మార్గంపై నడవడం మీ పని, ఇంకే జంజాటాలు ఎదురుగా వస్తాయి? జంజాటాలలోనైతే మొత్తం ప్రపంచము ఉంది. తండ్రి అంటారు, నేనైతే సరళమైన డైరెక్ట్ మార్గాన్ని తెలియజేస్తాను. అది చాలా సహజమైనది. ఇకపోతే విపత్తులు, జంజాటాలు ఏవైతే వస్తాయో, ఏదైతే దుఃఖము కలుగుతుందో, అనారోగ్యము మొదలైనవి ఏవైతే వస్తాయో, దివాలా తీస్తారో... ఇవన్నీ మీ కర్మల లెక్కలు. వీటిని ప్రతి ఒక్కరూ అనుభవించాల్సిందే, వీటితో నాకు ఎటువంటి సంబంధము లేదు. ఈ సమయంలో కూడా ఎవరైనా అటువంటి పాపాలు చేస్తే దుఃఖము అనుభవించాల్సి ఉంటుంది. నేనైతే మీకు దారిని చూపించడానికి వచ్చాను. నా ఆజ్ఞ ఏమిటంటే - తండ్రినైన నన్ను స్మృతి చేయండి ఎందుకంటే తిరిగి వెళ్ళాలి. గొడవలు-కొట్లాటలలోనైతే మొత్తం జీవితమంతా పోగొట్టుకున్నారు. నేనైతే డైరెక్ట్ మార్గాన్ని తెలియజేస్తాను - నన్ను స్మృతి చేయండి మరియు పవిత్రంగా ఉండండి. అలా ఎలా ఉండాలి, ఆ యుక్తులను కూడా తెలియజేస్తాను. ఇక తర్వాత కష్టపడడం, పురుషార్థం చేయడం అనేది మీ పని. ఈ కర్మబంధాలన్నీ పిల్లలైన మీవే. తండ్రి అంటారు, గృహస్థ వ్యవహారములో ఉంటూ పవిత్రముగా ఉండాలి. స్త్రీకు పతి పట్ల, పిల్లల పట్ల మోహం చాలా ఉంటుందని తండ్రికి తెలుసు. దాని నుండి విముక్తులుగా అవ్వడం, నష్టోమోహులుగా అవ్వడం... ఇది పిల్లల పనే.

తండ్రి అయితే కేవలం రెండే మాటలు చెప్తారు - ఒకవేళ పూర్తి వారసత్వాన్ని తీసుకోవాలంటే ఒకటి పవిత్రముగా తప్పకుండా అవ్వాలి మరియు రెండవది యోగములో ఉండాలి. ఒకవేళ ఎవరైనా ఏ విషయములోనైనా మీతో కొట్లాడితే

అది మీ కర్మల లెక్కాచారము. ఇకపోతే మీరు పవిత్రముగా ఉండండి, ఈ విషయంలో ప్రభుత్వం కూడా ఆపలేదు. తండ్రి మార్గాన్ని ఏమని తెలియజేస్తారంటే - మీరు ఇళ్ళు-వాకిళ్ళను వదలకూడదు, గృహస్థ వ్యవహారములో ఉంటూ పవిత్రముగా ఉండాలి మరియు యోగములో ఉండాలి. పవిత్రముగా ఉండడం చాలా కష్టమని మనుష్యులు భావిస్తారు ఎందుకంటే ఇటువంటి శిక్షణను ఎప్పుడూ ఎవరూ ఇవ్వలేదు. ఎంతోమంది బ్రహ్మచారులుగా ఉన్నా కానీ గృహస్థ వ్యవహారములో ఉంటూ పవిత్రముగా ఉండడమే ఇక్కడి నియమము. కుమారి అయితే పవిత్రముగానే ఉంటారు, ఆమెకు అయితే ఇది చాలా సహజము, పవిత్రముగానే ఉండండి. గృహస్థములోకి వెళ్ళకండి. ఇందులో కేవలం ధైర్యం కావాలి. మేము భారత్ ను స్వర్గంగా తయారుచేయడానికి పవిత్రంగా ఉండాలనుకుంటున్నాము, ఇందులో భారత్ యొక్క కళ్యాణమే ఉంది అని మీరు చెప్పవచ్చు. పవిత్రత అనే వారసత్వము మనకు లభిస్తుంది. ఇది వారసత్వాన్ని తీసుకునే విషయము. సత్యయుగములో పవిత్ర ప్రపంచమే ఉండేది. సంగమములో ఎవరైతే పవిత్రముగా అవుతారో, వారే పవిత్ర ప్రపంచానికి యజమానులుగా అవుతారు. ఇందులో మొత్తం ప్రపంచమంతా పవిత్రముగా ఎలా అవుతారు అన్న ప్రశ్నే లేదు. ఇప్పుడు ఇది అందరి వినాశన సమయము. ఇప్పుడు అందరూ లెక్కాచారాలను తీర్చుకొని తిరిగి వెళ్ళాలి. అందరూ వచ్చి అయితే జ్ఞానాన్ని తీసుకోరు. ఎవరైతే సహజ రాజయోగాన్ని నేర్చుకుంటారో, వారు వారసత్వాన్ని పొందుతారు. మొత్తం ప్రపంచమే కాదు సరికదా మొత్తం భారత్ కూడా ఈ జ్ఞానాన్ని విని ధారణ చేయలేదు. ఇకపోతే ఏవైనా గొడవలు ఉంటే వాటిని పిల్లలైన మీరు యోగబలము ద్వారా తొలగించాలి. ఎవరికైతే ఎంతోకొంత మమకారము ఉందో, నష్టోమోహులుగా అవ్వలేదో, అంతటి శక్తి లేదో, వారే దెబ్బలు తినాల్సి ఉంటుంది. ఒక గోపిక ఎంతగానో కన్నీరు పెట్టుకున్నట్లు తండ్రి వద్దకు సమాచారము వచ్చింది. కానీ ఏడ్చినంతమాత్రాన ఏమవుతుంది? తండ్రి యుక్తులైతే ఎన్నో తెలియజేసారు. పతికి చెప్పండి - నేను పవిత్రముగా ఉండాలనుకుంటున్నాను, మిగిలిన సేవలన్నింటినీ చేయడానికి సిద్ధంగా ఉన్నాను. యుక్తిగా మిమ్మల్ని మీరు విడిపించుకోవచ్చు. కానీ మొదట మీ హృదయంలోని మమకారం అంతమవ్వాలి. మాతలకు పతి పట్ల, పిల్లల పట్ల చాలా మోహం ఉంటుంది. కానీ, నన్ను ఎవరైనా విడిపించాలి అని అంటారు. కానీ ఇందులో ఆర్తనాదాలు చేయాల్సిన లేక ఏడ్వాల్సిన అవసరమేమీ లేదు. ఇది అర్థం చేసుకోవాల్సిన విషయం. ఒకవేళ ఎవరైనా మంచి వ్యక్తి యొక్క పత్ని ఉంటే, వారి పిల్లలు కూడా ఫస్ట్ క్లాస్ గా ఉంటే, బాబా అంటారు - గృహస్థ వ్యవహారములో ఉంటూ పవిత్రముగా ఉండి చూపించండి, ఈ అంతిమ జన్మ కొరకు. కావున పతికి అర్థం చేయించి వశం చేసుకోవాలి. లేకపోతే సమాధానం చెప్పాల్సి ఉంటుంది. కానీ ఎప్పుడైతే నష్టోమోహులుగా అవ్వగలుగుతారో, అప్పుడే సమాధానం చెప్పగలరు. ఎవరైనా తలచుకుంటే ఒక్క క్షణములో నష్టోమోహులుగా అవ్వగలరు, లేదంటే జీవితాంతము కూడా అవ్వలేరు. చాలామందికి విడిచిపెట్టిన తర్వాత కూడా మమకారం తొలగదు, ఇక మోహం లాగుతూ ఉంటుంది, కావున ఆ అవస్థ నిలవదు. అందుకే తండ్రి అంటారు, మొదటే నష్టోమోహులుగా అవ్వండి. అలా కాకుండా మీ కర్మలకు పశ్చాత్తాపపడుతూ ఉంటే అందులో తండ్రి ఏం చేస్తారు? అందరికీ దారి ఒక్కటే, పవిత్రముగా తప్పకుండా అవ్వాలి. ఒకవేళ పవిత్రముగా ఉండనివ్వకపోతే మీ కాళ్ళపై మీరు నిలబడి ఏదో ఒక సేవలో నిమగ్నమవ్వండి. ఇక్కడైతే స్వచ్ఛమైన హృదయం కావాలి. ఇంటిని విడిచిపెట్టి వచ్చి ఈ బ్రాహ్మణ కులములో ఉంటూ మళ్ళీ ఎవరో ఒకరితో ఫెమీలియారిటీలో (అతి చనువులో) చిక్కుకుని ఉండడం కాదు. ఫెమీలియారిటీ యొక్క తేలికపాటి నషా ఉండేవారు కూడా ఎంతోమంది ఉన్నారు. అటువంటివారి అవస్థ పైకి ఎక్కదు, వారు సేవకు యోగ్యులుగా అవ్వరు ఎందుకంటే లోపల పురుగు పట్టి ఉంది. మాయ విడిచిపెట్టదు. బాబా, మాయ తుఫానులు ఎన్నో వస్తూ ఉన్నాయి అని వ్రాస్తారు. అంటే తప్పకుండా తేలికపాటి నషా కలుగుతూ ఉండి ఉండవచ్చు. ఇక్కడ కమలపుష్ప సమానముగా ఉండాలి. వాడిపోయే విషయమేమీ లేదు. అందరికీ తమ-తమ కర్మబంధనాలు ఉన్నాయి, అలాగే వాటికి మందు కూడా దేనికదే ఉంది. ఎవరైనా సంపాదన గురించి అడిగితే బాబా వారి లెక్కల పత్రాన్ని చూసి సలహా ఇస్తారు. చాలామంది వ్యాపారం ఎలా ఉందంటే పాపాలు చేయకుండా శరీర నిర్వహణ జరగదు. ఈ రోజుల్లో సమయమే అలా అయిపోయింది. ఎవరి వద్దనైనా చాలా ధనము ఉంటే పాపాలు చేయవలసిన అవసరం ఉండదు. బాబా అంటారు, శాంతిగా కూర్చొని యోగ సంపాదనను జమ చేసుకోండి. కానీ పని చేసేకన్నా ముందు సలహా తీసుకోవాల్సి ఉంటుంది. పని చేసిన తర్వాత - నేను ఈ విషయంలో చిక్కుకుపోయాను, ఏమి చేయను అని అడగడం కాదు. బాబా అర్థం చేయిస్తూ ఉంటారు, ఒకవేళ ధనము బాగా ఉన్నట్లయితే శాంతిగా కూర్చొని బాబా నుండి వారసత్వము తీసుకోండి, వ్యాపార-వ్యవహారాల జంజాటాలను వదిలేయండి. అడుగడుగులోనూ శ్రీమతముపై నడవడం తప్పనిసరి. పరస్పరంలో చాలా మధురముగా ఉండాలి. లేదంటే బాప్ దాదా పేరును అప్రతిష్ఠపాలు చేస్తారు. బాప్ దాదాను లేక సద్గురువు నిందింపజేసేవారు ఉన్నత పదవిని పొందలేరు. మీ చేతిలోకి లా (చట్టము) ను తీసుకోకూడదు. లేదంటే - ఈశ్వరీయ కులములో కూడా ఇటువంటి పిల్లలు ఉంటారా? అని అందరూ అంటారు. తండ్రి అంటారు, ఎవరికీ దుఃఖము ఇవ్వకండి. ఉదయాన్నే లేచి బాబాను స్మృతి చేయండి. బాబా, మీరు ఎంత

మధురమైనవారు, మీరు మమ్మల్ని రాజులకే రాజులుగా, స్వర్గానికి యజమానులుగా తయారుచేస్తారు, మేము మీ శ్రీమతముపై తప్పకుండా నడుస్తాము, మేము ఆసురీ మతముపై నడవము. తండ్రిని స్మృతి చేయకపోతే - వీరిలో ఇప్పటికీ పాత ఆసురీ సంస్కారాలు ఉన్నాయి, వీరు స్వర్గ రాజ్య భాగ్యాన్ని ఏం తీసుకుంటారు అని తండ్రి అర్థం చేసుకుంటారు. మీ నడవడికనైతే చూసుకోండి. లేదంటే నిజానికి పిల్లలైన మీ వంటి అదృష్టవంతులు ప్రపంచమంతటిలోనూ ఎవరూ లేరు. తండ్రి అంటారు, స్వంత పిల్లలుగా అవ్వండి. తండ్రి కూడా సంతోషపడే నడవడికను చూపించండి. తండ్రికి పిల్లల విషయంలో చాలా చింత ఉంటుంది, ఎలా పిల్లలను దుఃఖము నుండి విడిపించి ఉన్నత పదవిని ప్రాప్తి చేసుకునేలా చేయాలి అని.

తండ్రి అర్థం చేయిస్తారు, పగలు పూట వ్యాపార-వ్యవహారాలు చేసుకోండి కానీ బ్రహ్మా-ముహూర్తములో లేచి తండ్రితో మధురాతి-మధురమైన మాటలు మాట్లాడాలి. బాబా, మీరు అద్భుతము చేసారు! 21 జన్మల కొరకు స్వర్గ రాజ్యాధికారాన్ని మీరు ఇస్తారు! నేను మీపై బలిహారమవుతాను. కావున బలిహారం అవ్వాలి, కేవలం అలా అనడం మాత్రమే కాదు. ఎంత సమయమైతే స్మృతిలో ఉంటారో, దాని ప్రభావము రోజంతా కొనసాగుతుంది. ఉదయం వేళ లేవని బి.కె.లు చాలామంది ఉన్నారు, అటువంటివారికి ధారణ కూడా జరగదు. ఉదయమే లేచే అలవాటు ఏర్పడినట్లయితే ఇక చూడండి, ఎంత సర్వీసబుల్ గా అవుతారో. ఎవరికైతే సేవ పట్ల అభిరుచి ఉంటుందో, వారు ఎక్కడైనా సేవ చేస్తారు. నిందలైతే వస్తూనే ఉంటాయి. వందమందిలో నుండి ఒక్కరు వెలువడుతారు. ఇందులో సిగ్గుపడకూడదు. సేవ అయితే ఎక్కడికక్కడే ఉంది, కేవలం చేసేవారు ఉండాలి. బాబా యుక్తులనైతే తెలియజేస్తూ ఉంటారు. నషా ఉండాలి. నరుని నుండి నారాయణునిగా అయ్యే నషాలో తప్ప మిగిలిన అన్ని నషాలలోనూ నష్టం ఉంది. ఈ నషాను తండ్రే ఎక్కిస్తారు. ఇంకెవరి వద్దా ఈ జ్ఞానం యొక్క నషా లేదు. పతిత ప్రపంచము మరియు పావన ప్రపంచము గురించి కూడా ఎవరికీ తెలియదు. పతిత ప్రపంచములో తప్పకుండా పతితులు ఉంటారు, కావుననే పావన దేవతలను పూజిస్తారు. సత్య, త్రేతాయుగాలలో పావన మహారాజ, మహారాణులు ఉండి వెళ్ళారు. రావణుని రాజ్యము ద్వాపరం నుండి మొదలవుతుంది.

శివబాబా మాకు మంచి కర్మలు నేర్పిస్తారని మరియు పదవి యొక్క సాక్షాత్కారాన్ని కూడా చేయిస్తారని పిల్లలకు తెలుసు. ఇది ప్రత్యక్షఫలము యొక్క సాక్షాత్కారము. కావున ఎప్పుడైతే తండ్రి స్వయంగా నేర్పించేందుకు వచ్చారో, అప్పుడు వారి నుండి నేర్చుకునేందుకు ఎంత ఉత్కంఠత ఉండాలి. కర్మబంధనాలు ఉన్నాయి అని కేవలం ఇలా అనడాన్ని కూడా బలహీనత అనే అంటారు. కర్మబంధనాల నుండి విముక్తులయ్యేందుకు యుక్తులను కూడా బాబా తెలియజేస్తూ ఉంటారు. కానీ ఇటువంటి సలహాను పక్కాగా ఉండేవారికే ఇవ్వగలరు, అంతేకానీ కచ్చాగా ఉండేవారికి కాదు. చాలామంది బంధనాలలో ఉన్నవారు కూడా పురుషార్థం చేసి జ్ఞాన-యోగబలంతో పతిని వశం చేసుకుని వారిని తీసుకువస్తారు, వారు దెబ్బలు కూడా చాలా తింటారు. ధరణి బద్దలైనా కానీ ధర్మాన్ని వదలకండి అని అంటారు కదా. కావున ఇక్కడ కూడా ప్రతిజ్ఞ చేయడం జరుగుతుంది మరియు దానిపై నిలిచి ఉండాలి. దానిని అమలుపరచాలి. మాయ చాలా శక్తివంతమైనది, దానిపై విజయం పొందాలి, పూర్తి పురుషార్థం చేయాలి. స్వర్గములో ఏ పదవిని పొందినా పర్వాలేదు అని భావించడం కాదు. అలా కాదు, పురుషార్థం ఉన్నతముగా తయారయ్యేందుకే చేయాలి. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. లా (చట్టము) ను చేతిలోకి తీసుకోకూడదు. పరస్పరంలో చాలా-చాలా మధురముగా ఉండాలి. ఎవరికీ దుఃఖము ఇవ్వకూడదు. బ్రహ్మా ముహూర్తములో లేచి తండ్రితో మధురాతి-మధురమైన మాటలు మాట్లాడాలి.

2. క్షణములో నష్టోమోహులుగా అవ్వాలి. పవిత్రముగా ఉండేందుకు యుక్తులు రచించాలి. ధైర్యము ఉంచాలి. జ్ఞాన-యోగబలంతో లెక్కాచారాలను తీర్చుకోవాలి.

వరదానము:- సేవా క్షేత్రంలో స్వ-సేవ మరియు సర్వుల సేవ యొక్క బ్యాలెన్స్ ను పెట్టే మాయాజీత్ భవ

సర్వుల సేవతో పాటు మొదట స్వ-సేవ అవసరము. ఈ బ్యాలెన్స్ సదా స్వలో మరియు సేవలో ఉన్నతిని ప్రాప్తి చేయిస్తుంది, అందుకే సేవా క్షేత్రంలో పరుగులు తీస్తూ ఈ రెండు విషయాల బ్యాలెన్స్

పెట్టండి, అప్పుడు మాయాజీతులుగా అవుతారు. బ్యాలెన్స్ పెట్టడం ద్వారా అద్భుతం జరుగుతుంది. లేదంటే సేవలో బాహ్యముఖత కారణంగా అద్భుతానికి బదులుగా స్వయం మరియు ఇతరుల భావ-స్వభావాల ఘర్షణలోకి వస్తారు. సేవా పరుగులలో మాయ బుద్ధి యొక్క పరుగులు తీయిస్తుంది.

**స్లోగన్:-** తమ విశేషతలు అనే బీజాన్ని సర్వశక్తులు అనే జలముతో తడిపి వాటిని ఫలదాయకంగా చేయండి.